క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో రేణుకా గంగమ్మతల్లి కొలుపులు



సముద్ర స్నానానికి బయలుదేరిన రేణుకా గంగమ్మ తల్లి విగ్రహాలు

నాగులుప్పలపాడు: బోలే వారి కుటుంబ ఆరాధ్య దైవం శ్రీ రేణుకా గంగమ్మ తల్లి కొలుపులు బుధవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈదుమూడి గ్రామంలో స్వయంభూగా వెలిసిన రేణుకా గంగమ్మ తల్లికి గ్రామంలోని బోలే వారి కుటుంబం, వారి దాయాదులు ప్రతి ఐదేళ్లకు ఒకసారి భక్తిశ్రద్ధలతో కొలుపులు నిర్వహించడం ఆనవాయితీ. ఈ కొలుపుల్లో మొదటి రోజు అమ్మవారిని మేళతాళాల నడుమ సముద్రస్నానానికి తీసుకెళ్లారు. ఐదు రోజుల పాటు ఎంతో వైభవంగా జరిగే ఈ కొలుపులకు సుదూర ప్రాంతాలలో ఉంటున్న బోలే వారి దాయాదులు, గ్రామస్తులు పాల్గొంటారని ఆలయ నిర్వాహకులు తెలిపారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో ఐదుగురికి జైలు

గిద్దలూరు రూరల్: డ్రంక్ అండ్ డ్రైవింగ్ కేసులో పట్టుబడిన ఐదుగురికి గిద్దలూరు అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి కె.భరత్ చంద్ర 5 రోజుల జైలు శిక్షతోపాటుగా రూ.10 వేల జరిమానా విధించినట్లు స్థానిక సీఐ కె.సురేష్ తెలిపారు. ఇటీవల గిద్దలూరు సర్కిల్ పరిధిలో మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పట్టుబడిన వారిని కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి తీర్పు వెల్లడించారని పేర్కొన్నారు. నిందితుల డ్రైవింగ్ లైసెన్స్‌ను జడ్జి ఆరు నెలలపాటు రద్దు చేశారని తెలిపారు.

గ్రామ సభకు 23 అర్జీలు



అధికారులకు అర్జీలు ఇస్తున్న రైతులు

కంభం: మండలంలోని తురిమెళ్ల గ్రామంలో గురువారం జేసీ ఆదేశాల మేరకు నిర్వహించిన రెవెన్యూ గ్రామ సభకు 23 అర్జీలు అందాయని తహసీల్దార్ కిరణ్ తెలిపారు. అర్జీల్లో నాలుగు సమస్యలను పరిష్కరించామని, మిగిలిన వాటిపై తగిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ పేర్కొన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఆర్ఐ పీర్సా, వీఆర్వోలు, సర్వేయర్లు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

చలో విజయవాడకు తరలిన ఉద్యోగులు

గిద్దలూరు రూరల్: విజయవాడలోని లయోలా కాలేజీ ప్రాంగణంలో గురువారం నిర్వహించిన కౌన్సిల్ సమావేశానికి గిద్దలూరు తాలూకా ఉద్యోగులు తరలివెళ్లారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద ప్రభుత్వ ఉద్యోగుల సంఘ గిద్దలూరు తాలుకా అధ్యక్షుడు వై.పి.రంగయ్య మాట్లాడుతూ.. ఉద్యోగస్తుల సమస్యలపై చర్చించి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు కౌన్సిల్ సమావేశం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఉద్యోగ సంఘం నాయకులు అరిగెల వెంకటరామయ్య, నాగేంద్రయాదవ్, అల్లూరయ్య, అచ్చయ్య, ఈశ్వర్‌రెడ్డి, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ భూతాన్ని తరిమేద్దాం



మెడికల్ కళాశాలలో మొక్కలు నాటుతున్న ప్రిన్సిపాల్ డాక్టర్ ఏడుకొండలు



పాత రిమ్స్‌లో ర్యాలీ ప్రారంభిస్తున్న డీఎంహెచ్ఓ

ఒంగోలు టౌన్: ప్లాస్టిక్ భూతాన్ని తరిమేసి పర్యావరణాన్ని కాపాడుకుందామని జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి డాక్టర్ టి. వెంకటేశ్వరరావు పిలుపునిచ్చారు. గురువారం ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని పాత రిమ్స్ ఆస్పత్రి వద్ద ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్ఓ మాట్లాడుతూ ప్లాస్టిక్ వినియోగంతో పర్యావరణం దెబ్బ తింటుందని, అనేక ప్రాణాంతక వ్యాధులు ప్రబలుతాయన్నారు. ప్రపంచ ఆరోగ్య నివేదిక ప్రకారం ఇప్పటికే 90 శాతం గాలి కాలుష్యమైందని తెలిపారు. ఇవి మానవుల ఊపిరితిత్తులను దెబ్బ తీస్తాయన్నారు. తొలుత ముక్కు కారడం, ఆస్తమా, ఛాతి నొప్పి వంటివి బాధిస్తాయని, తర్వాత ఆరోగ్య పరిస్థితి మరింత దిగజారుతుందన్నారు. ఇది గుండె, మెదడు, చర్మంపై తీవ్రమైన ప్రభావం చూపుతుందన్నారు. ప్లాస్టిక్ ఉపయోగించడమంటే వ్యాధులను కొనుక్కొన్నట్లేనని చెప్పారు. భవిష్యత్తు తరాలకు ఆరోగ్యాన్ని అందించాలంటే తొలుత ప్లాస్టిక్ వినియోగానికి స్వస్తి పలకాలని సూచించారు. భావి తరాలు అంతులేని రోగాల బారిన పడతాయని హెచ్చరించారు. ప్రోగ్రాం అఫీసర్ భగీరథి, ఎన్‌సీడీ నోడల్ ఆఫీసర్ రాజేష్, విక్టర్ బాబు పాల్గొన్నారు.

ఆర్టీసీ డిపోలో మొక్కలు నాటిన మేనేజర్

పర్యావరణ పరిరక్షణ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆర్టీసీ డిపోలో మేనేజర్ డి.శ్రీనివాసులు మొక్కలు నాటారు. గ్యారేజీ లోపల, బస్సు స్టాండ్ ఆవరణలో ప్లాస్టిక్ బాటిళ్లను, చెత్త చెదారాన్ని శుభ్రం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్లాస్టిక్‌తో ప్రపంచానికి పెను ముప్పు పొంచి ఉందన్నారు. ఎవరి సౌలభ్యం వారు చూసుకోకుండా ప్లాస్టిక్ వాడకాన్ని త్యజించాలని పిలుపునిచ్చారు. క్యారీ బ్యాగులకు బదులుగా గుడ్డతో చేసిన సంచులను వాడితే ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా, ఆనందంగా ఉంటారని చెప్పారు. ప్లాస్టిక్ వినియోగాన్ని నిలిపివేస్తామని ప్రతిజ్ఞ చేయించారు. అసిస్టెంట్ ఇంజినీర్ విజయ, ట్రాఫిక్ సూపరింటెండెంట్ బీకే నాయక్, సెక్యూరిటీ ఇన్‌స్పెక్టర్ వెంకట్రావు పాల్గొన్నారు.

మెడికల్ కళాశాలలో..

పర్యావరణ పరిరక్షణ దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రభుత్వ వైద్య కళాశాల ప్రాంగణంలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఏడుకొండలు మొక్కలు నాటారు. పర్యావరణ పరిరక్షణ బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ప్లాస్టిక్‌ను విచ్చలవిడిగా వినియోగిస్తే పర్యావరణం పూర్తిగా దెబ్బతింటుందని, ప్రజలు అనేక వ్యాధుల బారిన పడుతున్నారని తెలిపారు. ప్రజలు ఇప్పటికైనా మేలుకోకపోతే రానున్న రోజుల్లో ఫలితం అనుభవించాల్సి వస్తుందన్నారు. ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ డాక్టర్ తిరుమలరావు, కమ్యూనిటీ మెడిసిన్ సిబ్బంది పాల్గొన్నారు.



ఆర్టీసీ డిపోలో మొక్కలు నాటుతున్న డిపో మేనేజర్ శ్రీనివాసులు

ఒంగోలు మెట్రో: ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని వాసవీ క్లబ్స్ ఆధ్వర్యంలో రోజూ ఒక చెట్టు, 100 రోజుల్లో 100 చెట్లు నాటి పర్యావరణ సమతుల్యాన్ని కాపాడాలని వాసవీ క్లబ్ ఒంగోలు సిటిజన్ అధ్యక్షుడు భూమా శ్రీనివాసులు కోరారు. ఒంగోలులోని స్థానిక సీతారాంపురం వాసవి విద్యానిధి ఆర్యవైశ్య బాలుర వసతి గృహం వద్ద గురువారం మొక్కను నాటి పర్యావరణ దినోత్సవ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. రీజియన్ చైర్మన్ చలువాది సత్యనారాయణ, డిస్ట్రిక్ట్ ఆఫీసర్ చీదెళ్ల వెంకట ప్రసాద్, క్లబ్ పూర్వ అధ్యక్షుడు రాధారమణ, క్లబ్ కోశాధికారి మద్దాలి శివప్రసాద్ పాల్గొన్నారు.

ఒంగోలు సిటీ: ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డాక్టర్ నిడమనూరి సూర్య కళ్యాణ్ చక్రవర్తి గురువారం మొక్కలు నాటారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ పిలుపు మేరకు అమ్మ పేరుతో ఒక మొక్క కార్యక్రమం నిర్వహించారు. ఒంగోలులోని వివిధ ప్రాంతాల్లో మొక్కలు నాటారు. చెన్నకేశవ నగర్ నుంచి బీజేపీ కార్యకర్తలు, క్విస్ కళాశాల ఎన్ఎస్ఎస్, ఎన్‌సీసీ విద్యార్థులతో కలిసి పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించారు. విరాట్ నగర్, వెంగముక్కపాలెం, సర్వేరెడ్డి పాలెం, క్విస్ కళాశాలలో విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు. గ్రామస్తులకు మొక్కలు పంపిణీ చేసి పర్యావరణ ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా సూర్య కళ్యాణ్ చక్రవర్తి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని, వాటిని సంరక్షించాలన్నారు. హరిత ఆంధ్రప్రదేశ్ వికసిత్ భారత్ నిర్మాణాన్ని సాధించడంలో భాగంగా ప్రతి పౌరుడు పర్యావరణ పరిరక్షణలో పాల్గొని కాలుష్య వ్యర్థాలను, ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గిస్తూ ఉండాలన్నారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు సెగ్గం శ్రీనివాస్, కార్పొరేటర్ మోహన్, నాయకులు పాల్గొన్నారు.



మొక్కలు నాటుతున్న సూర్య కళ్యాణ్ చక్రవర్తి



మొక్కలు నాటుతున్న క్లబ్ సభ్యులు



చీమకుర్తిలో మొక్కలు నాటుతున్న కమిషనర్, నాయకులు

మొక్కలతోనే పర్యావరణ పరిరక్షణ

చీమకుర్తి: పర్యావరణ పరిరక్షణకు మొక్కలు తోడ్పడతాయని చీమకుర్తి మున్సిపల్ కమిషనర్ వై.రామకృష్ణయ్య అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా గురువారం చీమకుర్తిలోని మున్సిపల్ కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిఒక్కరూ వారింటి పరిసరాలలో మొక్కలు నాటడాన్ని అలవాటు చేసుకోవాలన్నారు. గానుగ, టేకు, ఇతర మొక్కలను మున్సిపల్ కార్యాలయ ఆవరణలో నాటారు. కార్యక్రమంలో స్థానిక మున్సిపల్ కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

వనమహోత్సవాన్ని విజయవంతం చేయాలి...

నాగులుప్పలపాడు: పర్యావరణాన్ని కాపాడటానికి మొక్కలు ఎంతగానో దోహదం చేస్తాయని ఉపాధి పథకం ఏపీవో రవి అన్నారు. గురువారం మండలంలోని అన్ని గ్రామాల్లో వన మహోత్సవం కార్యక్రమం నిర్వహించారు. బాధ్యత గల ప్రతి పౌరుడు ఒక్కో మొక్క నాటాలని ఏపీవో సూచించారు. కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

సంతనూతలపాడులో...

సంతనూతలపాడు: స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో గురువారం జెడ్పీటీసీ దుంపా రమణమ్మ, ఎంపీపీ బుడంగుంట విజయ, ఎంపీడీవో డి.సురేష్‌బాబు, తదితరులు మొక్కలు నాటారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పర్యావరణాన్ని పరిరక్షించుకుంటే మనల్ని మనం కాపాడుకున్నట్లే అన్నారు. పర్యావరణ కాలుష్యానికి ప్రధాన కారణమైన ప్లాస్టిక్ భూతాన్ని తరిమికొట్టాలనే సంకల్పంతో ఈ ఏడాదికి ప్లాస్టిక్ కాలుష్యాన్ని అంతం చేయడమే లక్ష్యంగా జూన్ 5వ తేదీ ప్రపంచ పర్యావరణ దినోత్సవం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ముమ్మరంగా మొక్కలు నాటాలని కోరారు. కార్యక్రమంలో మండల ఎన్ఆర్ఈజీఎస్ ఏపీవో వాసంతి, మాజీ సర్పంచ్ రంపతోటి అంకారావు, మండల ఆయుర్వేద వైద్యాధికారి డాక్టర్ కరుణాకరరావు, ఎన్ఆర్ఈజీఎస్, మండల పరిషత్ సిబ్బంది, నాయకులు పాల్గొన్నారు.



సంతనూతలపాడులో మొక్కలు నాటుతున్న జెడ్పీటీసీ దుంపా రమణమ్మ, ప్రజాప్రతినిధులు

పర్యావరణ పరిరక్షణ మనందరి బాధ్యత...

పర్యావరణ పరిరక్షణ మనందరి బాధ్యతని బీజేపీ నాయకుడు బాలినేని కళ్యాణ్‌రెడ్డి అన్నారు. సంతనూతలపాడు మండలంలోని పేర్నమిట్ట పరిధిలో గురువారం మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించి మాట్లాడారు. జిల్లా ఓబీసీ అధ్యక్షుడు దండు శ్రీనివాసరావు, ఒంగోలు 43వ డివిజన్ అధ్యక్షుడు నాగ బ్రహ్మాచారి, మహేంద్ర, చెంచిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



రాపర్లలో మొక్కలు నాటుతున్న ఉపాధి సిబ్బంది, నాయకులు

సెలూన్ షాపులు మూసివేసి నిరసన

సంతనూతలపాడు: నాయీ బ్రాహ్మణ వృత్తిలోకి ఇతరుల చొరబాటు తగదంటూ సెలూన్ షాపులు నిర్వహిస్తున్న నాయీ బ్రాహ్మణులు గురువారం షాపులు మూసివేసి నిరసన వ్యక్తం చేశారు. నాయీ బ్రాహ్మణ సాధికార కమిటీ నియోజకవర్గ కన్వీనర్ కరేటి నరసింహారావు పిలుపుమేరకు సంతనూతలపాడు మండలంలోని సెలూన్ వృత్తిదారులు క్షవర వృత్తి షాపులు మూసివేసి నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కరేటి నరసింహారావు మాట్లాడుతూ 1989లో నాయీ బ్రాహ్మణ ఫెడరేషన్ ఏర్పడినప్పుడు నాయీ బ్రాహ్మణ మహిళలకు బ్యూటీషియన్ కోర్సు నేర్పించారని, ఆ కోర్సు నాయీ బ్రాహ్మణులకు మాత్రమే చెందిందని తెలిపారు. ప్రస్తుతం ఈ వృత్తిలోకి ఇతరుల చొరబాటు తగదన్నారు. సెలూన్ వృత్తి నాయీ బ్రాహ్మణులు మాత్రమే చేసుకునేలా జీఓ వస్తేనే ఇతరుల చొరబాటు ఆగుతుందన్నారు. అందుకు రాష్ట్రవ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు నిర్వహించాలని కోరారు. ఆలిండియా బహుజన సమాజ్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధరణికోట లక్ష్మీనారాయణ మాట్లాడుతూ ఇతర కులస్తులకు ప్రభుత్వమే సెలూన్ వృత్తి నేర్పించడం, స్పా సెంటర్ల పేరుతో వ్యభిచారం చేయించడం, సెలూన్ షాపుల ముసుగులో తుపాకులు అమ్మటం వంటి అసాంఘిక కార్యక్రమాలు జరగటంతో నాయీ బ్రాహ్మణ కుల ఔన్నత్యాన్ని కోల్పోతున్నామన్నారు. ప్రాచీన కులవృత్తి క్షవరవృత్తిలోకి ఇతరులు వచ్చి నాయీ బ్రాహ్మణులపై ఆర్థిక దాడులు, మోడ్రన్ పేరుతో చేస్తున్న అందవిహీన పనుల వల్ల నాయీ బ్రాహ్మణ కులం అవమానాల పాలవుతోందన్నారు. క్షవరవృత్తి నాయీ బ్రాహ్మణులదే అని జిల్లా బీసీ సమన్వయ కమిటీ కన్వీనర్ గుంటూరు మస్తాన్‌రావు తెలిపారు. నాయీ బ్రాహ్మణ కులవృత్తులలోకి ఇతరుల చొరబాటు సహించేది లేదని, సెలూన్ వృత్తిని గ్రామీణ, మండల స్థాయిలలో నాయీ బ్రాహ్మణులే చేసుకునేలా ప్రభుత్వం జీవో అందించాలని ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి వంకేశ్వరం గోవిందు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయీ బ్రాహ్మణ ఒంగోలు నగర అధ్యక్షుడు అయ్యప్ప, నాయీ బ్రాహ్మణ సేవా సంఘం సంతనూతలపాడు మండల ఉపాధ్యక్షుడు గుంటూరు పిచ్చయ్య, మద్దులూరి ప్రసాదు, గుంటూరు ప్రసాదు, ఏల్చూరి రాఘవేంద్రరావు తదితరులు పాల్గొన్నారు.



నిరసన వ్యక్తం చేస్తున్న నాయీ బ్రాహ్మణ సంఘ సభ్యులు

శాంతియుత వాతావరణంలో బక్రీద్ జరుపుకోవాలి

నాగులుప్పలపాడు: బక్రీద్ పండుగను శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని స్థానిక ఎస్సై రజియా సుల్తానా సూచించారు. గురువారం నాగులుప్పలపాడు మండల పరిధిలోని ముస్లిం మతపెద్దలతో స్థానిక పోలీస్ స్టేషన్లో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ ఈ నెల 7వ తేదీ బక్రీద్ పండుగను ఎలాంటి వివాదాలకు తావులేకుండా మసీదులు, ఈద్గాల వద్ద ఆహ్లాదకరమైన వాతావరణంలో జరుపుకోవాలని సూచించారు. గ్రామ స్థాయిలో ఏమైనా సమస్యలుంటే పోలీసుల దృష్టికి తీసుకురావాలని కోరారు. ప్రజల శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు.



మత పెద్దలతో మాట్లాడుతున్న ఎస్సై రజియా సుల్తానా

ప్రకృతి వ్యవసాయం బలోపేతం చేయాలి

కొత్తపట్నం: ప్రకృతి వ్యవసాయాన్ని బలోపేతం చేయాలనే లక్ష్యంతో మూడు రోజులు పాటు శిక్షణ ఇచ్చినట్లు ప్రకృతి వ్యవసాయం జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ వి.సుభాషిణి తెలిపారు. అందులో భాగంగా ఆంధ్రప్రదేశ్ ప్రజా భాగస్వామ్య ప్రకృతి వ్యవసాయం ఆధ్వర్యంలో గురువారం కొత్తపట్నంలో ప్రకృతి వ్యవసాయ సాగును అధికారులు పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రకృతి వ్యవసాయం రైతులు మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయంలో ఖర్చు తక్కువ.. ఆదాయం ఎక్కువగా ఉందని, దిగుబడులు బాగా వస్తున్నాయని చెప్పారు. 50 సెంట్ల పొలంలో ఏడాదికి రూ.2 లక్షల ఆదాయం వస్తుందని వివరించారు. అధికారులు అన్ని రకాల పైర్లను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. వ్యవసాయం శాఖ స్టేట్ అధికారులు మాధవి, ఏడీఏలు, ఏవోఎస్, హెచ్‌వోఎస్, ఎన్ఎఫ్ఏఎస్, ఎంటీఎస్ పాల్గొన్నారు.



పైరును పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు

నిరుపయోగంగా ప్రభుత్వ భవనాలు



నిరుపయోగంగా ఉన్న పాత తహసీల్దార్ కార్యాలయ భవనం



చిల్లచెట్లతో నిండిన వీడియో కాన్ఫరెన్స్ భవనం

- అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా మారుతున్న వైనం
- బీసీ హాస్టల్‌కు ఓ భవనం కేటాయించాలని వినతులు

తర్లుపాడు:

లక్షల రూపాయలు వెచ్చించి ప్రజల అవసరాల కోసం నిర్మించిన ప్రభుత్వ భవనాలు నిరుపయోగంగా మారి శిథిలావస్థకు చేరుకుంటున్నాయి. అలనా పాలనా కరువవ్వడంతో భవనాలు దెబ్బతింటున్నాయి. అధికారులు సమన్వయం చేసుకుని ప్రత్యామ్నాయ అవసరాలకు ఆయా భవనాలను వినియోగించాలని మండల ప్రజలు కోరుతున్నారు. వివరాల్లోకి వెళ్తే.. మండల కేంద్రం తర్లుపాడులోని పాత తహసీల్దార్ కార్యాలయం గత 4 సంవత్సరాలుగా నిరుపయోగంగా ఉండటంతో అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారింది. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో నూతన భవనంలోకి తహసీల్దార్ కార్యాలయాన్ని తరలించడంతో అప్పటి నుంచి పాత భవనం ఖాళీగా ఉంది. దీంతో చీకటి పడగానే కొందరు మందుబాబులు అక్కడి చేరుకుని మద్యం తాగుతున్నారు.

అలాగే స్థానిక ఐసీడీఎస్ కార్యాలయం సైతం నిరుపయోగంగా ఉంది. ఈ రెండు భవనాలను వినియోగంలోకి తెచ్చేందుకు ప్రజాప్రతినిధులు, అధికారులు చొరవ చూపాలని తర్లుపాడు వాసులు కోరుతున్నారు.

అద్దె భవనంలో బీసీ హాస్టల్..

మండల కేంద్రంలోని జెడ్పీ పాఠశాలలో సుమారు 60 శాతంపైగా బీసీ విద్యార్థులు 6 నుంచి 10 తరగతి వరకు చదువుకుంటున్నారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి బస్సు సౌకర్యం లేకపోవడంతో సుమారు 100 మందికిపైగా విద్యార్థులు అరకొర వసతులున్న అద్దె భవనంలో నిర్వహిస్తున్న బీసీ హాస్టల్లో ఉండి చదువుకుంటున్నారు. ఇరుకు గదుల్లో మగ్గుతూ అవస్థలు పడుతున్నారు. విద్యార్థులకు సరిపడా స్నానపు గదులు, మరుగుదొడ్లు లేవు. ఇంటర్మీడియెట్ కాలేజీతోపాటు బీసీ విద్యార్థులకు వసతులతో కూడిన నూతన బీసీ హాస్టల్ ఏర్పాటు చేయాలని మండల ప్రజలు ఎప్పటి నుంచో అధికారులు, ప్రజా ప్రతినిధులను కోరుతున్నారు. కనీసం ఈ భవనాలనైనా బీసీ హాస్టల్‌కు వినియోగించే విధంగా ప్రజా ప్రతినిధులు కృషి చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

బీసీ హాస్టల్‌కు కేటాయించాలి



పేరుకు మండల కేంద్రమే కానీ తర్లుపాడులో బీసీ విద్యార్థులకు సరైన హాస్టల్ వసతి లేదు. అద్దె భవనంలో కొనసాగిస్తున్నారు. పాత తహసీల్దార్ కార్యాలయాన్ని బీసీ హాస్టల్‌కు కేటాయిస్తే విద్యార్థులకు ఉపయోగకరంగా ఉంటుంది.

– అక్బర్ అలీ, కోఆప్షన్ సభ్యులు, తర్లుపాడు

వసతులు ఉంటే విద్యార్థులకు మేలు



మండలంలోని సుమారు 10 గ్రామాల బీసీ విద్యార్థులు తర్లుపాడులోని బీసీ హాస్టల్లో ఉంటూ చదువుకుంటున్నారు. వసతులు లేని అద్దె భవనం కావడంతో ఇబ్బంది పడుతున్నారు. పాత తహసీల్దార్ కార్యాలయ భవనంగానీ, ఖాళీగా ఉన్న ఐసీడీఎస్ భవనంలోగానీ హాస్టల్ నిర్వహిస్తే విద్యార్థులకు సౌకర్యంగా ఉంటుంది. అధికారులు, ప్రజాప్రతినిధులు ఆ దిశగా చర్యలు తీసుకోవాలి.

– గుమ్మా రాజేంద్రప్రసాద్, వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు

ఘనంగా రామాలయ ప్రతిష్ఠ ఉత్సవాలు

కొనకనమిట్ల: మండలంలోని నాగంపల్లిలో పట్టాభిరామస్వామి ఆలయ నూతన ధ్వజ స్తంభ ప్రాణ ప్రతిష్ఠ మహోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. వేద పండితుడు శేఖర శర్మ పర్యవేక్షణలో టీటీడీ ఆగమ పండితుల ఆధ్వర్యంలో విశేష పూజలు, అభిషేకాలు, అర్చనలు చేశారు. రాత్రి ఏర్పాటు చేసిన కోలాట ప్రదర్శన భక్తులను అలరించింది. శుక్రవారం నూతన ధ్వజ స్తంభ ప్రతిష్ఠ, అనంతరం సీతారాముల శాంతి కల్యాణం, భక్తులకు అన్న సంతర్పణ చేస్తున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు.